సృష్టిలో తియ్యనిది

శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

జీవితం అంటేనే అంతకాబోలు. లేకపోతే-యీ క్షణాన అందినట్లు భ్రమపెట్టి ఓహో అనుకునేంతలోనే అందకుండాపోయి-పైగా ఊరిస్తున్నట్లు వెక్కిరిస్తుందా?

పోనీ.. నీ సంగతి నా కెందుకని వదిలేద్దామంటే అదిమాత్రం సాధ్యమా? జిజ్ఞాస మెదడుని దొల్చివేయకుండా ఊరుకోదే! కుతూహలం నిలవనీయదే! ఏదో ఒక ఆకర్షణ లేకపోతే అడుగులేసి అడుగు వెయ్యడం పడదే. రేపటికోసం ఎదురుచూసే ఆశలేకపోతే నేడు నడిచేదీ గడిచేదీ ఎలాగ?

మనిషి ఎదిగాడు. ఎదుగుతూనే ఉంటాడు.

పచ్చిమాంసంతో ఆకలి తీర్చుకునే దశనుంచి—పచనంలో రుచులను బేరీజు వేసేవరకూ వచ్చాడు ఆకలి తీర్చుకోడంలో కూడా రకరకాల రుచులు కావాలి. విసుగుని వోడించడానికి జీవితంలో వైవిధ్యం ఏర్పరచుకుంటున్నాడు. భౌతికంగానే కాదు, మానసికంగానూ క్రొత్తదనంకోసం కొట్టుకుంటూనే ఉన్నాడు.

జిజ్ఞాసకల మనిషికి—జీవితం తరగని ఖని.

అవ్వుతున్నకొద్దీ లోతులు చూపుతూనే ఉంటుంది. ఇంకా ఉన్నాననే అంటుంది. అంటు దొరికినట్టే అనిపించి అంతలోనే నవ్వుతుంది. నీ సంగతి నా కెందుకులే అని వదిలేద్దామన్నా వదలనివ్వక రెచ్చగొడుతుంది. ఈ తృష్ణ అవసరమ్మూ ఆరోగ్యదాయకమూ కూడా!

*   *   *

సాయంత్రం ఉషారుగా వీధిలోకి బయలుదేరాను. నా ఉత్సాహానికి కారణం—నా జేబులో ఒక బ్లాంక్ చెక్ ఉండడమే. నిన్నటికి నిన్న—నేను పనిచేసి రిటైరయిన కంపెనీ మానేజరు మార్కెట్ దగ్గర కనిపించి—కారాపారు నాకు కించిత్ గర్వం కలిగింది. ఆఫీసరు గారి కంటె వయసులో మాత్రమే పెద్దవాడినయిన నాకోసం వారు కారాపడమే కాక నన్ను పిలిచి కారెక్కమన్నారు.

కారు పరుగెడుతూంటే కుశలప్రశ్నలయ్యాయి.

"విశ్వనాథం!...ఓ మాంఛికుర్రాడు కావాలయ్యా. చాకులాటివాడుండాలి. నీ అంత సిన్సియర్‌గా తెలివి తేటలుగా పనిచెయ్యగలిగేవాడు..."

"నా సీటులో ఎవరినో వేశారుకదా సార్?"

"లాభం లేదనిపించేశాడు." పెదవివిరచి—"ప్చ్!" ఏమిటో... కుర్రవాళ్ళు...నువ్వెళ్లిపోయాక చెయ్యి విరుచుకున్నట్లుందనుకో. అరవయ్యేళ్ళ పైన పడుతున్నా ఆఫీసుపని ఎంత చురుకుగా చేసుకుపోయేవాడివి. అలాగ—చలాకీగా...పన్చెయ్యగలిగే క్యాండిడేట్‌ని నువ్వే ఎంచి నా దగ్గరకు తీసుకురా. మారు మాటాడకుండా ఉద్యోగం వేయిస్తాను" అన్నారు.

నాకు తృప్తిగా...గర్వంగా ఉంది.

పని చెయ్యడం ఒకెత్తు. ప్రశంస పొందడం ఒకెత్తు.

నేను రిటైరయి ఆరు నెలలు దాటుతోంది. అయినా నా సర్వీసుని గుర్తుపెట్టుకుని నన్నభినందించడమే కాకుండా నామీద ఒక గురుతరమయిన బాధ్యతను కూడా వేశారు ఆఫీసరు. ఈ గుర్తింపు నన్ను గుర్రమెక్కించి వదిలింది.

"తప్పకుండా సర్. త్వరలోనే మీరు కోరినట్లు చురుకయిన కుర్రాడిని తెస్తాను. మీ దయకు నా ధన్యవాదాలు" అని సెలవు తీసుకున్నాను.

కారు దిగి యింటివైపు నడుస్తూంటే ఏవో నినాదాలు... ఊరేగింపు.

మహిళా సంవత్సర సందర్భంగా—వరకట్నాన్ని నిషేధిస్తూ స్లోగన్‌లు చెబుతున్నారు. నవ్వొచ్చింది. ఉద్యమాలతోటీ ఊరేగింపులతోటి బతుకులు ఉద్ధరించబడగలిగితే అంతకంటె ఏం కావాలి?

ఆడపిల్లకి పెళ్లి—
మగవాడికి ఉద్యోగం—
రెండూ అసాధ్యాలే అనిపించేస్తున్నాయి. కాలమహిమ!

అంతకీ-అక్కడెక్కడో ఓ రాజకీయ నాయకుడు యువలతో—"కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకోం"డని ఉపన్యాస మిన్వబోతే—"అలాగే. మాకు లంచాలూ రికమెండేషన్లూ అవసరంలేకుండా ఉద్యోగం వచ్చే ఏర్పాటు చెయ్యండి" అన్నారుట వాళ్ళు. వాళ్లది తప్పుకాదు. ఉన్నమాటే. ఉద్యోగం అంటే అదో యజ్ఞమైపోతూంది.

ప్రకాశానికి యీ బాధలేదు. అది వాడి అదృష్టం.

రేపు వాణ్ని తీసుకెళ్లి మానేజర్‌కి చూపిస్తాను. ప్రకాశం చురుకయినవాడు. సమయస్ఫూర్తి ఉన్నవాడు. మానేజర్‌ని మెప్పించగలడు.

దేముడు వరమిచ్చినట్లే వచ్చింది అవకాశం. నిజానికి ప్రకాశానికి యీ ఉద్యోగం రాకపోయినా ఫరవాలేదు. ఎలాగయినా నెగ్గుకురాగలడు. కాని-వచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలి? నెలకి నాలుగువందల జీతం. చేదా?

* * *

మూడుగంటలకి ప్రకాశాన్ని వెంటపెట్టుకుని మానేజరు దగ్గరికి బయలుదేరాను వాడితో ఏమీ అనలేదు ఊరికే నాతో రమ్మన్నానంతే.

రోడ్డుమీద పదిగజాలు నడిచానో లేదో – ఎదురయ్యాడు రామనాథం.

రామనాథం నా ఆరోప్రాణమే.

చిన్నప్పుడు గోళీలాటలో–తరవాత పేకాటలో–ఇప్పుడు చదరంగంలో–మేట్. రిటైరయిపోయాక (రామనాథమూ నాకంటె నెల ముందు రిటైరయ్యాడు) ఏ ఆధ్యాత్మిక కార్యక్రమానికయినా నేనూ అతనూ కలిసేవెళ్తాం ఒకరే అనుకునే స్నేహం. మా స్నేహానిదీ యించుమించు మా వయస్సే. నేను గుమాస్తానయితే-వాడు బడిపంతులు. రిటైరయిపోయాం కనుక యిప్పుడిద్దరమూ ఒకటే. ఎటొచ్చీ నా కొక్కడే కొడుకు నాడికీ ఒక్కడే కొడుకు కాని అదనంగా ఐదుగురమ్మాయిలు.

రామనాథం ముఖం దీనంగా ఉంది.

"అలా ఉన్నావేం?" ఆత్రంగా అడిగాను.

చెబులానన్నట్టు సైగచేసి–ప్రకాశంవంక తిరిగి– "ముసిలాళ్ళతో నీకెందుక్కానీ ఇలా వెళ్ళి తిరిగిరా..." అన్నాడు

ప్రకాశం వెళ్ళిపోయాడు

నా చూపులో యింకా ప్రశ్నార్థకం మిగిలే ఉంది.

"బడిపంతులు రిటైరయ్యేసరికి మిగిలేది బిలబిలమంటూ సంతానమే అసలే అయ్యవారి నట్టిల్లు, ఆపైన గడ్డురోజులు. నేడో రేపో అబ్బాయికి కనీసం కోమటి కొట్లో పద్దుల గుమాస్తా పదవయినా దొరక్కపోతే సంసారం నడివీధిన పడేటట్టుంది. అంటే–యిప్పుడు యింట్లో ఉంటున్నామని కాదు కానీ..." ఆకాశంవేపు చేతులు జోడించాడు.

జాలితోపాటు ఉద్రేకమూ కట్టలు తెంచుకుంది నాలో.

సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్-అంటూ మెదడులో హెచ్చరిక.

రామనాథంకష్టం నా కష్టమే అనిపించింది.

Grams. OFFCHEM

Phone . 39352

With Best Compliments

From

SILVERCHEM INDUSTRIES

437, Mint Street,

MADRAS-600001

ముందూ వెనుకా ఆలోచించకుండా అనేశాను— "మూప్ఫై ముప్ఫయ్ రూపాయల కోమటి గుమాస్తా దేనికి కానీ – పద మీ అబ్బాయిని తీసుకెళ్లి నేను పన్జేసిన కంపెనీలో క్లర్కుని చేద్దాం—"

నిజమా అన్నట్లు చూశాడు.

మా స్నేహంలో సరసాలూ ఉంటాయి. అనుక వాడు నన్ను శంకించినా ఆశ్చర్యంలేదు. జరిగినది యావత్తూ చెప్పాను. నా మాటలు నమ్మాడు. అరగంట తిరక్కుండా వాళ్లబ్బాయిని ఆఫీసరు దగ్గరికి తీసుకెళ్లడమేమిటి, అపాయింట్‌మెంట్ ఆర్డరు యిప్పించెయ్యడ మేమిటి, అంతా శరవేగంతో జరిగిపోయింది.

ఇద్దరమూ పార్కు చేరుకున్నాం.

"నిజంగా...యిది...నిజమే అని నమ్మకం..." వాడికి మాటలు పెగలడంలేదు. అనుకోనంత వెలుగు హటాత్తుగా ఎదు రయినా మనిషిచూపు మందగించి తీరుతుందికద. నేను నవ్వుతూ చూశాను. "నీ కొడుకు మొదటినెల జీతంతెచ్చి నీచేతిలో పోసేవరకూ నిజమో కాదో తేల్చుకోలేవులే!"

రామనాథం నా చేతులు పట్టుకుని—"నీ మేలు జన్మలో మరచి పోలేనురా. దేముడుకూడా యింత సాయం చేస్తాడంటే నమ్మలేను. నువ్వు చాలా మంచి దేముడివి..." అన్నాడు గద్గదికస్వరంతో.

ఒరేయ్!...పిచ్చి మాటలు కట్టిపెట్టు...నేను దేముణ్నేమిటి? స్నేహితుణ్నంతే. సృష్టిలో తీయనిది స్నేహమే అని అనగా వినలేదూ? స్నేహితులమధ్య కృతజ్ఞతలూ అవీ ఏమిటి?" మందలించాను.

"జాను" అన్నాడు రామనాథం.

చీకటి పడేవరకూ కబుర్లు చెప్పుకుని ఇళ్లకు బయులుదేరాము.

రాత్రి నాకు పక్కని నిద్రపట్టింది.

*   *   *

దేముడో దయ్యమో తెలియడంలేదు.

నేను చూసిన ఒక బొమ్మలో యముడిలా ఉన్నాడు.

ఆ భయంకర రూపాన్ని చూస్తూనే వణికిపోయాను.

కొంచం దూరంలో పడుకున్న భార్యనీ కొడుకుని పిలవాలను కున్నాను. కాని-నోరు విడదే! మనిషిని కదలలేకపోతున్నాను.

వికటాట్టహాసం వెనువెంటనే గర్జన.

"నేను మృత్యుదేవతని. నాకు ఆ [illegible] ఉంది"

చిత్రంగా—అతనితో మాట్లాడ్డానికి నా నోరు పెగిలి విడింది. "వంటింట్లో చల్ది అన్నం ఆవకాయా ఉన్నాయి. తెచ్చేదా?"

"ప్రాణాలతోకాని నా ఆకలి తీరదు. అనవసరపు తాత్సారం చెయ్యక, ముందు ఎవరి ప్రాణం తీసుకునేదో చెప్పు. నీదా, నీ భార్యదా, నీ కొడుకుదా? ఊఁ."

అయ్యో!...ప్రాణంలో ప్రాణమయిన భార్య! పున్నామ నరకం నుంచి తప్పించే కొడుకు...పోనీ...నేనే బలైపోతే?... అమ్మో! ...

"ఊఁ .." గర్జన.

"నా భార్య" అనేశాను. క్షణం విరామం. నా కన్నుల్లో నీరు.

"మరో ప్రాణం...అర్జంటుగా చెప్పు..." నా పీకమీద భయం కర హస్తం.

గింజుకుంటూ అన్నాను—"నా కొడుకు—"

ప్రసాద్ విగతజీవి ఐపోయాడు

"మరొక్క ప్రాణి. చాలు...తొందరగా చెప్పు. నీదా, నీ స్నేహి తుడు రామనాథానిదా?"

నా పీక మీదవేళ్లు బిగుసుకుంటున్నాయి. భయంతో కొయ్యకట్టుకుపోతూ చెప్పేశాను.

"రామనాథానిదే."

మృత్యుదేవత నవ్వుతూ వెళ్లిపోయింది. అప్పుడు నాకనిపిం చింది. మనిషి స్వార్థపరుడు. ప్రపంచాన్నంతటినీ బలిపెట్టి అయినా సరే తన ప్రాణంకోసం ఆరాటపడతాడు. భార్యనీ, పుత్రుణ్నీ... స్నేహితుణ్ని కోల్పోయి దుఃఖాతిశయంలో మునిగిపోయాను. పశ్చాత్తా పంతో, విచారంలో కదలలేక కట్టెలా ఐపోయిన నేను—నా భార్య పలక రింపుతో ఆశ్చర్యంగా కదిలాను.

ఓహో! ఇదంతా కలే అన్నమాట. ఎవరూ చనిపోలేదు నిజానికి.

ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ ఆవిడ భుజాలమీద చెయ్యి వేసి ఉద్రేకంగా అన్నాను. "సృష్టిలో తీయనిది స్నేహమే కాని, అతి తియ్యనిది మాత్రం ప్రాణమే. సొంతప్రాణం. మరేమీ అనుకోకు. నన్ను క్షమించు."

తెల్లబోయి చూస్తూందావిడ—నావేపు.

జీవితం యింతే. ఉండుండి ఓ మొట్టికాయవేసి—నవ్వేవాళ్లను ఏడిపిస్తుంది.

ఓ చిలిపి పనిచేసి—ఏడిచేవాళ్లను నవ్విస్తుంది

జీవితాన్ని పూర్తిగా తెలుసుకోగలగడం—గాలిని పిడికిట బంధించబోవడమే!

పూర్తిగా కళ్లు తెరిచాను.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna, Vijayawada. Phones . 75667 & 75226.